క్లుప్తంగా

ఘనంగా మహిళా దినోత్సవ కార్యక్రమాలు



టెక్కలి: శాంతి సుధా మందిరంలో సామూహిక సీమంతాలు చేస్తున్న దృశ్యం

టెక్కలి: భగవాన్ సత్యసాయి 98వ జయంతి కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పట్టణంలో ఘనంగా మహిళా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక రోటరీనగర్ మందిరంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. అలాగే కంద్రవీధి సత్యసాయి మందిరం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

ఇందిరాగాంధీకి ఘనంగా నివాళి



దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

టెక్కలి: దేశాభివృద్ధికి ఇందిరాగాంధీ ఆలోచనలే శరణ్యమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు అన్నారు. ఆదివారం దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా టెక్కలిలో ఆమె విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ తరఫున నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోత మధుసూదనరావు, భాస్కర్‌బాబు, పి.ఆనంద్, ఆర్.సూర్యకుమారి, ఎస్.ధర్మారావు, వెంకటరమణ, పార్వతీశం, ఎస్.ఉగాది, బి.లక్ష్మీపతి ఉన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



బెల్లుపడ మండపం వద్ద గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం: రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మున్సిపాలిటీలోని బెల్లుపడ సచివాలయం 12, 13 వార్డులో 'వై ఏపీ నీడ్స్ జగన్'కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జెండాను, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, దుక్క లోకేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ నర్తు నరేంద్ర, పార్టీ నాయకుడు పిలక సంతు, ప్రచార విభాగ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఆదిరెడ్డి, వార్డు కౌన్సిలర్ నీలాపు లక్ష్మి, పట్టణ పార్టీ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, జేసీఎస్ కన్వీనర్ సాలిన ఢిల్లి, నీలాపు ఢిల్లి పాల్గొన్నారు.

వైఎస్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న వసంతరెడ్డి తదితరులు

సంతబొమ్మాళి: మండల కేంద్రమైన సంతబొమ్మాళిలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఏర్పాటుకు జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో ప్రజలు స్వర్ణయుగం చూశారన్నారు. మళ్లీ ఆయన తనయుడు.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అలాంటి పాలనను ప్రజలు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేరుగు రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.అప్పారావు, నక్క భీమారావు, జీరు బాబూరావు, బి.మోహన్‌రెడ్డి, కె.సతీష్, రెయ్యి రామిరెడ్డి, సురాడ రాజారావు, సురాడ వెంకటేష్, మర్రు నాగభూషణరావు, కె. అప్పారావు పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



మాట్లాడుతున్న వసంతరావు

కవిటి: అగ్నికుల క్షత్రియ సామాజికవర్గానికి రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని జిల్లా అధ్యక్షుడు గౌరకల వసంతరావు కోరారు. జిల్లాలో జనాభా ప్రాతిపదికన పలాస నియోజకవర్గంలో తొలిస్థానం, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో రెండోస్థానంలో ఉన్నామన్నారు. కవిటిలోని చిక్కాఫ్ కార్యాలయంలో ఆదివారం జిల్లా సాధారణ సమావేశం నిర్వహించి మాట్లాడారు. సంఘ నాయకులు జుత్తు నీలకంఠం, పులకల శ్రీరాములు, పొల్లాయి లక్ష్మణమూర్తి ఉన్నారు.

ప్రగతి బాటలో పల్లెలు



బాలకృష్ణాపురం రోడ్డు దుస్థితి



అద్దంలా మెరుస్తున్న బాలకృష్ణాపురం రోడ్డు

- తీరిన రహదారి కష్టాలు
- ఆనందంలో గ్రామీణులు

ఇచ్ఛాపురం రూరల్:

పల్లెలు ప్రగతి బాటలో పయనిస్తున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో మారుమూల పల్లెలకు కూడా జిగేల్ మెరిసేలా పక్కా రోడ్లను ఏర్పాటు చేశారు. దీంతో ప్రజల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పాలించిన నాయకులు సరైన నిర్ణయాలు తీసుకోకపోవడంతో రోడ్లు సరిగా లేక గ్రామీణులు ఇబ్బందులు పడుతుండేవారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించడంతో ప్రజల రోడ్ల కష్టాలకు చెక్ పడింది. గ్రామీణ రోడ్లకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతో పల్లె రోడ్లకు మహర్దశ పట్టింది. అభివృద్ధి అంటే ఇదేనేమో అంటూ ప్రతిపక్షాలకు చెందిన నాయకులు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. గతంలో ఇచ్ఛాపురం మండల కేంద్రానికి మారుమూల గ్రామాల నుంచి ప్రధాన రహదారికి చేరుకోవాలంటే గుంతలు, కంకర రహదారులతో ప్రజలు నిత్యం అవస్థలు పడేవారు. ఇక వర్షాకాలంలో అయితే ప్రయాణం నరక ప్రాయంగా ఉండేది. తాజాగా ప్రధాన రహదారులకు లింకుగా ఉన్న రహదారులను ప్రభుత్వం గుర్తించింది. ఇందులో భాగంగానే ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) కింద మంజూరు చేసిన నిధులతో పనులు పూర్తవ్వడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ రోడ్ల నిర్మాణ నిధులు మంజూరుకు ఎంతగానో కృషి చేశారు.

- బుడ్డేపుపేట నుంచి బాలకృష్ణాపురం వరకు 3.22 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు రూ.74 లక్షలు మంజూరు చేయడంతో వారం రోజుల్లోనే పనులు పూర్తయ్యాయి.
- ఈదుపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఏ.బలరాంపురం వరకు 1.32 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు రూ.34.32 లక్షలు మంజూరు చేయడంతో పనులు పూర్తి చేశారు
- గత ఏడాది ఇచ్ఛాపురం నుంచి తేలుకుంచి మీదుగా రూ.1.50 కోట్ల వ్యయంతో 10 కిలో మీటర్ల మేర కొళిగాంకు తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు
- రత్తకన్న నుంచి మశాఖపురం-బిర్లంగి మీదుగా హరిపురం వరకు రూ.2 కోట్లు వ్యయంతో ఎనిమిది కిలో మీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణ పనులు జరిగాయి
- బూర్జపాడు నుంచి పెద్ద లక్ష్మీపురం వరకు 5.45 కిలో మీటర్ల పొడవున రూ.487 లక్షలతో ప్రధాన మంత్రి సడక్ యోజన పథకం ద్వారా రోడ్డు పనులు పూర్తయ్యాయి



డొంకూరు తీర ప్రాంతం రోడ్డు



కొత్త రోడ్డు వేశాక తళతళలాడుతున్న బలరాంపురం రోడ్డు

కల నెరవేరింది



ఏ.బలరాంపురం గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం కోసం గ్రామస్తులంతా కలలు కనేవారు. అయితే గతంలో ఏ ప్రభుత్వం నెరవేర్చలేదు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం బలరాంపురం గ్రామానికి రోడ్డు మంజూరు చేసి కలలను సాకారం చేసింది. కొద్దిరోజుల్లోనే రోడ్డు పనులు పూర్తయ్యాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పి.సాయిరాజ్‌లకు గ్రామస్తుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం

– ఇసురు తులసీరాం, ఇన్నేశుపేట

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

మా గ్రామం నుంచి బుడ్డేపుపేట రోడ్డుకు రావాలంటే 3.22 కిలోమీటర్ల గుంతల మయంగా ఉండేది. అత్యవసర పనులు సమయాల్లో చాలా అవస్థలు పడేవాళ్లం. 104, 108 వాహనాలు వచ్చే అవకాశం ఉడేదికాదు. గ్రామంలో పాల వ్యాపారులు పదుల సంఖ్యలో ఉన్నారు. వారంతా నడక దారినే ఇచ్ఛాపురం చేరుకునేవారు. అటు ఉన్నత చదువులకు విద్యార్థులదీ అదే పరిస్థితి. నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ కృషి ఫలితంగా రూ.74 లక్షలతో రోడ్డు పనులు పూర్తయ్యాయి. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం

– దుర్గాశి మోహన్‌దాస్, మాజీ సర్పంచ్, బాలకృష్ణాపురం

● క్రికెట్ కోలాహలం..



కాశీబుగ్గ: కాశీబుగ్గలో మంత్రి సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెర వద్ద పోరును తిలకిస్తున్న స్థానికులు

పురుషుల క్రికెట్ ఫైనల్‌పోరు సందర్భంగా ఆదివారం రోజంతా పట్టణాలు, పల్లెల్లో కోలాహలం నెలకుంది. ఆస్ట్రేలియాతో జరిగిన పోరును వీక్షించేలా ఊరూరా ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసి సందడి చేశారు. అయితే భారత్ చేతికి అందివస్తోందని భావించిన ప్రపంచకప్పును ఆస్ట్రేలియా ఎగరేసుకు పోవడంతో నిరుత్సాహానికి లోనయ్యారు.

పిక్నిక్ సందడి



టెక్కలి: కోటబొమ్మాళి సమీపంలోని తోటలో సహపంక్తి భోజనాలు చేస్తున్న విద్యార్థులు



కవిటి:ప్రగడపుట్టుగలో కార్తీక వనసమారాధన పూజల్లో మహిళలు

టెక్కలి: కార్తీకమాసం రావడంతో అప్పుడే పిక్నిక్‌ల హంగామా ఆరంభమైంది. ఆదివారం భావనపాడు బీచ్‌తో పాటు గ్రామాలకు ఆనుకుని ఉన్న తోటల్లో వనభోజనాల సందడి కనిపించింది. సహపంక్తి భోజనాలతో, చిన్నారుల ఆటల పాటలతో పిక్నిక్‌ల హంగామా ఆరంభమైంది.

వైభవంగా కార్తీక వనసమారాధన

కవిటి: మండలంలోని వివిధ గ్రామాల్లో కార్తీక మాసదీక్షల్లో భాగంగా భక్తులు కార్తీక వనసమారాధన వేడుకల్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉసిరి చెట్టు కింద వంటల్ని తయారు చేశారు. లక్ష్మీనారాయణుల్ని కార్తీక దామోదర వ్రతం పేరిట ప్రత్యేక పూజలు చేసి అన్నదాన చేశారు. నిర్వహించడంద్వారా ఈ కార్తీక వనసమారా ధన నిర్వహించుకోవడం ప్రతీ ఏటా సాంప్రదాయంగా చేసుకుంటున్నారు.అంతకుముందు కార్తీకదీక్షల్లో భాగంగా శివాలయాలు,వైష్ణవాలయాల్లో దీపారాధన విశేష పూజల్ని భక్తులు నిర్వహించారు.

ఆఫ్‌షోర్‌కు అప్పయ్యదొర పేరుపెట్టాలి



మాట్లాడుతున్న విజయకుమార్‌దొర

కాశీబుగ్గ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పలాస రేగులపాడువద్ద మహేంద్రతనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు నిర్మించాలని అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న హనుమంతు అప్పయ్యదొర సూచించారని ఆయన కుమారుడు విజయకుమార్‌దొర అన్నారు. అందుకే ఇప్పుడు ఆఫ్‌షోర్‌కు అప్పయ్యదొర పేరుపెట్టాలని కోరారు. పలాసలోని అప్పయ్యదొర స్వగృహం ఆదివారం ఏర్పాటు చేసిన దొరగారి ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అప్పయ్యదొర అంటే నమ్మకం, ధైర్యం, త్యాగానికి మారుపేరన్నారు. ప్రముఖ వైద్యులు దువ్వాడ జీవితేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది ఒడిశి బాలక్రిష్ణలు దొర జీవిత చరిత్ర, ఈ ప్రాంతానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో బలగ ప్రకాష్, చాపర సుందరలాల్, డాక్టర్ వై.వి.రామినాయుడు, మజ్జి పున్నయ్య, పైల జవహార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం



కోటబొమ్మాళి: మంచాలపేటలో ప్రచారం చేస్తున్న గృహసారథులు



ఇచ్ఛాపురం రూరల్: కేశుపురంలో బ్రోచర్లు అందజేస్తున్న నాయకులు

కోటబొమ్మాళి: మంచాలపేట, బంజరుపేట గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నూక సత్యరాజ్, జేసీఎస్ ఇన్‌చార్జి జి.నాగభూషణరావు ఆధ్వర్యంలో గృహసారథులు ఆదివారం ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారికి అందుతున్న రాయితీల గురించి వివరించారు. మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కాళ్ల సంజీవరావు, ఎంపీటీసీ సభ్యుడు కె.శ్రీనివాసరెడ్డి, ఎంఎల్‌వో తారకేశ్వరరావు, గందాపు ప్రశాంత్, బమ్మిడి శ్రీనివాస్, ఇర్రి చిరంజీవి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్రానికి జగనన్నే మళ్లీ రావాలని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే'కార్యక్రమంలో భాగంగా ఆదివారం కేశుపురంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై అభిప్రాయాలను సేకరించారు.

రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శిగా లక్ష్మణమూర్తి



లక్ష్మణమూర్తికి నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు

కంచిలి: రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శిగా కంచిలి మండలం సాలినపుట్టుగ గ్రామానికి చెందిన సాలిన లక్ష్మణమూర్తి ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎన్జీవో కార్యాలయంలో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు చేతులమీదుగా ఎమ్మెల్సీ నర్తు రామారావు సమక్షంలో నియామక పత్రాన్ని శనివారం అందుకున్నారు. లక్ష్మణమూర్తికి పదవి వరించడంపై ఇచ్ఛాపురం నియోజకవర్గం అఖిలభారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి నర్తు నరేంద్రయాదవ్, రాష్ట్ర కార్యదర్శులు దట్టి అజయ్‌యాదవ్, కొత్రాయి వాసుయాదవ్, కంచిలి మండల యాదవ సంఘం అధ్యక్షుడు కొల్లి ఈశ్వరరావు, సభ్యులు బొండాడ పురుషోత్తం యాదవ్, మడ్డు వెంకటరావు హర్షం వ్యక్తం చేశారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



టెక్కలి: గ్రంథాలయంలో వారోత్సవాల్లో తహసీల్దారు ప్రవళ్లికప్రియ



కాశీబుగ్గ: మాట్లాడుతున్న బమ్మిడి సంతోష్, రోజారాణి

టెక్కలి: గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కె.ప్రవళ్లికప్రియ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రంథాలయ కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పుస్తకాల విజ్ఞానం గూర్చి వివరించారు. అనంతరం దివంగత ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.రూపావతి, పాఠకులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: గ్రంథాలయాలతో విజ్ఞానం సాధ్యమని పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కో–ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్‌కుమార్ అన్నారు. పలాస శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన వారోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. ఇక్కడ ఉన్న దిన, వార, మాస, త్రైమాస పత్రికలు, పోటీపరీక్షల పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గాంధీనగర్ సచివాలయ మహిళా పోలీసు రోజారాణి చేతులమీదుగా ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై.రాంబాబు, ముంగుర పద్మావతి, బందాపు శ్రీనిధి పాల్గొన్నారు.

కృపారాణి పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు



ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న నాయకులు

టెక్కలి: కేంద్ర మాజీమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, శీతల పానీయాలు పంపిణీ చేశారు. అలాగే అభయం ఫుడ్ బ్యాంక్ వద్ద నిరుపేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ సత్తారు సత్యం, నాయకులు టీబీజీ గుప్తా, వి.శ్రీధర్‌రెడ్డి, గొరింట కృష్ణ, బొడ్డేపల్లి శ్రీను, బి.లక్ష్మీపతి, పి.మాధవరావు, పార్వతీశం, బి.కార్తీక్, చొక్కాకుల జీవన్, హరీష్, సతీష్, రమేష్ పాల్గొన్నారు.

రోటరీ సేవలు ఆదర్శనీయం



భూమి పూజ చేస్తున్న నిమ్మన దాస్

సోంపేట: సోంపేట రోటరీ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు ఆదర్శనీయం అని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. రోటరీ ద్వారా నిర్మాణం చేపడుతున్న సులబ్ కాంప్లెక్స్ అవసరాలకు బోరుబావి నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. సర్పంచ్ నగిరి ప్రభావతి, రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, రోటరీ ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఇచ్ఛాపురం: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వాసంతి ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో 123 మందికి సుగర్, బీపీ తదితర పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ త్రినాథ్‌రెడ్డి, రోటరీ అధ్యక్షుడు సప్పటి రోహిత్, కార్యదర్శి రాజ్‌కుమార్, క్లబ్ ప్రతినిధులు వల్లంపాటి సురేష్, కృష్ణమూర్తిరెడ్డి, నవీన్ చౌదరి, గోపాల్, నవీన్, తులసీదాస్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



నేత్ర పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఇచ్ఛాపురం: సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి నేత్ర వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. సత్యసాయిబాబా 98వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన శిబిరంలో 63 మందికి పరీక్షలు నిర్వహించగా.. తొమ్మిది మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో గోపాలరావు, సుబ్బారావు, జనార్దన పాల్గొన్నారు.

సత్యసాయి బోధనలు అనుసరణీయం

- జెడ్పీ చైర్‌పర్సన్ విజయ



జెడ్పీ చైర్‌పర్సన్ విజయను సత్కరిస్తున్న భజన మండలి మహిళలు

కవిటి: సత్యసాయిబాబా బోధనలు నేటి తరానికి అనుసరణీయమని శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఆదివారం కవిటిలో శ్రీసత్యసాయి భజనమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన సత్యసాయి సంస్థల మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సాయి భజన కాలక్షేపంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా భజనమండలి మహిళలు విజయను దుశ్శాలువతో సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో ఛట్‌పూజ



మఠం చెరువు వద్ద పూజ చేస్తున్న భక్తులు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం పొందుతున్న పలువురు నార్త్ ఇండియన్స్ ఛట్ పూజ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ప్రతీ ఏడాది కార్తీక మాసంలో దీపావళి తర్వాత ఈ పూజను చేయడం సంప్రదాయం. వీరు స్థానిక మఠం చెరువు వద్దకు పూజాసామగ్రితో ఊరేగింపుగా వచ్చి పూజలు చేశారు.

తెలగ సామాజికవర్గం ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో సంఘ నేతలు

కంచిలి: బెల్లుపడ గ్రామం వద్ద గల మామిడి తోటలో మండల తెలగ సామాజిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర సంఘ అధ్యక్షుడు పి.వెంకటరావు, జిల్లా అధ్యక్షుడ రొక్కం సూర్యప్రకాశ్, సెక్రటరీ టి.రాజేంద్రదాస్, ట్రెజరర్ ఐ.జనార్దన, మండల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సభా వేదిక పనులు పరిశీలన

ఇచ్ఛాపురం రూరల్: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం వద్ద జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సభా వేదికను ఎంపీపీ బోర పుష్ప ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని అన్నారు.